21న వివేకానంద జన్మ తిథి వేడుకలు

కవాడిగూడ, జనవరి 16: స్వామి వివేకానంద 163వ జన్మతిథి వేడుకలను ఈ నెల 21న రామకృష్ణుల విశ్వజనీన దేవాలయంలో నిర్వహించనున్నట్లు రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 21వ తేదీ తెల్లవారుజామున ఐదున్నర గంటలకు సుప్రభాతం, మంగళహారతి, భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆరున్నర గంటలకు దేవాలయ ప్రదక్షిణ, ఏడు గంటలకు విశేష పూజ, కఠోపనిషత్ పారాయణం, భజనలు నిర్వమిస్తామన్నారు. పదిన్నరకు హోమం, పదకొండున్నరకు స్వామి వివేకానంద జీవితం, సందేశంపై ప్రసంగ కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం విశేష హారతి అనంతరం, భక్తులకు ప్రసాద వితరణ జరుపుతామన్నారు. రెండు గంటలకు వివేకానంద ఆడిటోరియంలో స్వామి వివేకానంద చలనచిత్ర ప్రదర్శనతో పాటు సాంస్కృతిక కర్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. నాలుగు గంటలకు నారాయణ సేవ, అనంతరం కమ్యూనిటీ వర్కర్స్‌కు సన్మాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. తర్వాత ఆరాత్రికం, ఏడు గంటలకు ప్రత్యేక భజనలు నిర్వహిస్తామి స్వామీజీ తెలిపారు.

గ్రేటర్ @ 27.8డిగ్రీలు



సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ): అగ్నేయ దిశ నుంచి వీస్తున్న కిందిస్థాయి గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 27.8డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 19.6డిగ్రీలు, గాలిలో తేమ 54శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

అధ్యయనం.. ఆపై కాలయాపన

హెచ్ఎండీఏలో కొత్త ఒరవడి పేరిట పనుల్లో జాప్యం

ట్రాన్సాక్షనల్ అడ్వైజరీల సూచనల మేరకే పనులు చేసేలా మారిన హెచ్ఎండీఏ పరిస్థితి

సిటీబ్యూరో, జనవరి 16(నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ పనితీరు మారింది. గతంలో మాదిరి ప్రణాళికలు రూపొందించి, ఆచరణలో పెట్టే విధానం నుంచి, కొత్త విధానంలో పనులు చేపడుతామని చెబుతూనే కాలయాపన చేస్తోంది. ఎన్నడూ లేని విధంగా ట్రాన్సాక్షనల్ అడ్వైజరీలు(టీఏ) చెబితే గానీ పనులు చేపట్టలేకపోతుంది. సమగ్ర విధి విధానాలపై స్వయంగా పరిశీలన చేయాల్సిన అవసరం లేకుండానే.. వడ్డించిన విస్తరి తరహా పని విధానానికి మొగ్గు చూపుతుంది. ఇలా కీలకమైన ప్రాజెక్టుల విషయంలో టీఏల నియామకం పేరిట కాలయాపన జరుగుతుంది. ప్రాజెక్టులకు టెండర్లు పిలిచి, పనులు ఎప్పుడూ చేపడుతుందనేది అంతు చిక్కని ప్రశ్న.

అభివృద్ధిలో కీలకం హెచ్ఎండీఏ

హైదరాబాద్ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించే హెచ్ఎండీఏ.. ట్రాన్సాక్షనల్ అడ్వైజరీ పేరిట కొత్త పని విధానాన్ని అమలు చేస్తోంది. నగరానికి తలమానికమైన ఎన్నో ప్రాజెక్టులను టీఏల పేరిట జాప్యం చేస్తోంది. ప్రాజెక్టు ఖర్చు, నిర్మాణ వ్యయం, రెవెన్యూ వంటి విషయాలను సొంతంగా అధ్యయనం చేసే హెచ్ఎండీఏ, ఇప్పుడు ఏజెన్సీల చేతికి బాధ్యతలు అప్పగించి చోద్యం చూసేందుకు సిద్ధమైతుంది. ఇప్పటికీ మూడు కీలకమైన ప్రాజెక్టుల విషయంలో ప్రత్యేకంగా ట్రాన్సాక్షన్ అడ్వైజర్లను నియమించుకుంటుం ది. జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు, అదే విధంగా ప్యారడైజ్ నుంచి డెయిర్ ఫాం రోడ్డు వరకు నిర్మించనున్న రెండు ఎలివేటెడ్ కారిడార్లు, మీరాలం కేబుల్ బ్రిడ్జితో పాటు, బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు అభివృద్ధి విషయంలో టీఏలను నియమించుకోనుంది.

టీఏల నియామాకం.. పనుల్లో జాప్యం

హెచ్ఎండీఏ చేపట్టనున్న కీలకమైన ప్రాజెక్టుల విషయంలో టీఏ నియామాకం వలన ప్రాజెక్టుల్లో జాప్యం జరుగుతుంది. ఆర్థికపరమైన, ఇతర అంశా ల్లో సాధ్యాసాధ్యాలను అంచనా వేసే బాధ్యతలను టీఏలను ఆశ్రయిస్తుండగా, ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వ్యవహారాలు ఆ సంస్థ అందించే వరకు ఆగాల్సిన పరిస్థితి నెలకొంది. నిర్మాణానికి ప్రధానమైన ఆర్థిక వనరులు, వినియోగం, నిర్వహణ భా రం వంటి రెవెన్యూ పరమైన అంశాలపై అంచనా వే సే ఈ టీఏలూ ఇచ్చే సలహాలు మాత్రమే కీలకంగా మారుతున్నాయి. అదే విధంగా ట్రాన్సాక్షనల్ అడ్వైజరీ సంస్థలే ప్రాజెక్టు ఒప్పంద వ్యవహారాలు, రెవె న్యూ సంబంధిత అంశాలను పర్యవేక్షించనుంది. నిర్మాణానికి ముందు డెవలపర్లతోనూ ఈ సంస్థనే చర్చలు జరపనుంది. ఆయా కంపెనీల ఆర్థికమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని హెచ్ఎండీఏకు దిశానిర్దేశం చేయనుంది. ఇలా ఒకప్పుడు హెచ్ఎండీఏ యంత్రాంగం చేయాల్సిన విధులు, బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగించి, పనిభారం తగ్గించుకునే ప్రయత్నాలు చేస్తోంది. టీఏల నియామానికే కీలక సమయం పోతుండగా, ఆ సంస్థలు నివేదికలు రూపొందించే వరకు ప్రాజెక్టులన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయ అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చిన్నయ సూరికి ఘన నివాళి

చిన్నయ సూరి చిత్ర పటానికి నివాళులర్పించిన కోలేటి దామోదర్ గుప్తా

ముషీరాబాద్, జనవరి 16: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న ఎందరో మహానుభావులు మధుర స్మృతులలో భాగంగా రచయిత పరవస్తు చిన్నయ సూరి సంస్మర సభ గురువారం జరిగింది. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నయ సూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ తెలుగు భాషా వ్యాకరణాన్ని సులభ శైలిలో అందించిన చిన్నయ సూరి వ్యాకరణ సిద్ధాంత కర్త అని అన్నారు. తెలుగు భాషా వికాసానికి సూరి రచనలు దోహదం చేశాయన్నారు. గానసభ అధ్యక్షుడు కళా వీఎస్ జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చొక్కాపు వెంకటరమణ, పెద్దూరి వెంకటదాసు, గాయని శ్రీదేవి పాల్గొన్నారు.

గొప్ప రాజనీతిజ్ఞుడిగా జైపాల్ రెడ్డికి గుర్తింపు

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, జనవరి 16(నమస్తే తెలంగాణ): ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, గొప్ప రాజనీతిజ్ఞుడిగా జైపాల్ రెడ్డి దేశ రాజకీయ ప్రయాణంలో మహోన్నతమైన వ్యక్తిగా నిలిచారని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కొనియాడారు. పీవీ మార్గ్‌లోని మాజీ కేంద్ర మంత్రి సూదిని జైపాల్ రెడ్డి 83వ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన వేడుకలలో కలెక్టర్ పాల్గొని జైపాల్ రెడ్డి సమాధిపై గురువారం పుష్ప గుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యేగా, పార్లమెంట్ సభ్యులు, రాజ్యసభ సభ్యులుగా అత్యుతమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారన్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ ఆర్టీఓ సాయిరాం, తహసీల్దార్ నయిమోద్దీన్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ ఏఎస్ రావు సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షల ఫలితాలు విడుదల

కాప్రా, జనవరి 16: డాక్టర్ ఏఎస్ రావు అవార్డ్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో 9,10 తరగతుల విద్యార్థులకు డిసెంబర్ 29న నిర్వహించిన 34వ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ పరీక్షల ఫలితాలను ఏఎస్ రావు అవార్డ్స్ కౌన్సిల్ ప్రతినిధులు విడుదల చేశారు. ఏఎస్ రావు నగర్‌లోని సంస్థ కార్యాలయంలో సైన్స్ టాలెంట్ పరీక్షల ఫలితాలను కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ జీఎస్‌వీఆర్‌కే చౌదరి, కార్యదర్శి కె.రామరాజు, ఉపాధ్యక్షులు కె.లక్ష్మణరాజు, సంయుక్త కార్యదర్శులు సి.చంద్రశేఖరం, వైవీ సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు ఎంటీకే హరినాథ్‌లతో కలిసి విడుదల చేశారు. 214 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 9వ తరగతిలో ప్రథమ ర్యాంకు సూర్యాపేటకు చెందిన కొమ్ము కార్తికేయ, ద్వితీయ ర్యాంకు సూర్యాపేటకే చెందిన పల్లవుల వైష్ణవి, తృతీయ ర్యాంకు సూర్యాపేటకు చెందిన రామరాజు వెంకట్ సాయి ప్రణవ సాధించారు. 10వ తరగతిలో ప్రథమ ర్యాంకు రాజమండ్రికి చెందిన కశ్యప వంశీ ఇళ్ల, ద్వితీయ ర్యాంకు రాజమండ్రికి చెందిన పూజేంద్ర వడ్లమూడి, తృతీయ ర్యాంకు సూర్యాపేటకు చెందిన యాతం ప్రజ్ఞారెడ్డి సాధించారు. ఇంతే కాకుండా 9వ తరగతిలో 19 ర్యాంకర్లను, 10వ తరగతిలో 18 ర్యాంకర్లను ప్రకటించారు. ప్రథమ బహుమతికింద రూ.25 వేల నగదు, ద్వితీయ బహుమతికి రూ.15 వేల నగదు, తృతీయ బహుమతికి రూ.10 వేల నగదు అందజేయనున్నట్టు సంస్థ కార్యదర్శి కె.రామరాజు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఫిబ్రవరి 9వ తేదీన ఏఎస్ రావు నగర్‌లోని డాక్టర్ హోమీ జే బాబా కమ్యూనిటీ హాలులో ఉదయం 9.30లకు జరిగే కార్యక్రమంలో నగదు పురస్కారాలు, సర్టిఫికెట్లు అందజేయనున్నట్టు ప్రతినిధులు తెలిపారు.

డాక్టర్ ఏఎస్‌రావు టాలెంట్ ఎగ్జామినేషన్స్ పరీక్షల ఫలితాలను విడుదల చేస్తున్న ఏఎస్ రావు అవార్డ్స్ కౌన్సిల్ ప్రతినిధులు

నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో టీ హబ్‌ను ప్రారంభించిన టీ హబ్ సీఈఓ సుజీత్ జాగిర్దార్

ఎగ్జిబిషన్‌లో టీ హబ్ స్టాల్ ప్రారంభం

అబిడ్స్, జనవరి 16: అఖిల భారత 84వ పారిశ్రామిక ప్రదర్శనలో భాగంగా నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో ఇన్నోవేషన్ పెవిలియన్, టీ హబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీ హబ్‌ను టి హబ్ సీఈఓ సుజీత్ జాగిర్దార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె. నిరంజన్, కార్యదర్శి బి.సురేందర్ రెడ్డి, సలహాదారులు ఆదిత్య మార్గం, కన్వీనర్ ఎం. చంద్రశేఖర్, జాయింట్ కన్వీనర్ సీజే శ్రీనివాస్, పి.దీప్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకతతో బోర్డు ప్రతిష్టను కాపాడండి

శిక్షణ తరగతిలో ఈడీ మయాంక్ మిట్టల్

సిటీబ్యూరో, జనవరి 16(నమస్తే తెలంగాణ): జల మండలికి కొత్తగా కేటాయించిన జూనియర్ అసిస్టెంట్ల మూడో బ్యాచ్‌కు గురువారం శిక్షణ అందించారు. ఈ శిక్షణను ఈడీ మయాంక్ మిట్టల్ ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ప్రారంభించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని, పనిలో పారదర్శకత పాటించాలని ఈడీ చెప్పారు. బోర్డు ప్రతిష్టను కాపాడేలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వీఎల్ ప్రవీణ్ కుమార్, సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం ఈ శిక్షణ కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించండి

ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మల్లారెడ్డిలకు వినతిపత్రాలు



సమస్యలపై ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మల్లారెడ్డిలకు వినతిపత్రాలు అందజేస్తున్న కీసర మండల ఆశా వర్కర్లు

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 16: ఆశా వర్కర్ల సమస్యలపై పార్లమెంట్, అసెంబ్లీలో మాట్లాడాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిలకు కీసర మండల ఆశా వర్కర్లు గురువారం వినతిపత్రాలు అందజేశారు. ఆశా వర్కర్ల సమస్యలను ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రికి తెలియజేయాలని కోరారు. ఆశాల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభ్వుతాలపై ఒత్తిడి చేయలని, కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో వేతనం రూ.18 వేలు ప్రకటనతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఆశాలు కోరారు. ఈ కార్యక్రమంలో ఆశాలు శంకరమ్మ, జయప్రద, మంగ, యాదమ్మ, వాణి, రాధ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వ నిధులేవి?

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

కాలనీల అభివృద్ధికి నిధులు అందజేస్తా..

ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

ఆరోగ్య కేంద్రానికి శుంకుస్థాపన చేసిన ఈటల, చామకూర

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 16: గ్రామాలు, మున్సిపాలిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పైసా ఇవ్వలేదని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పేర్కొన్నారు. నాగారం మున్సిపాలిటీ రాంపల్లి గ్రామంలో రూ.కోటి 43 లక్షల కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించనున్న పట్టణ పాథమిక ఆరోగ్య కేంద్రానికి గురువారం మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలసి ఎంపీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ, ఏడాది పాలన పూరైనా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల అభివృద్ధికి నిధులు మంజూరు చేయ లేదని, దాంతో గ్రామాలు, పట్టణాలలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వైద్య, విద్య, వ్యవసాయం, పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు.సంక్షేమ, అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం కోట్ల రూపాయిలు మంజూరు చేస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీ, గ్రామాల అభివృద్ధికి కోట్ల రూపాయిలు కేటాయించిందని, నిధులు లేక అభివృద్ధి పనులు జరగడం లేదని, మున్సిపల్ నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నారని అన్నారు. కాలనీలలో నెలకొన్న సమస్యలు (మంచినీరు, డ్రైనేజ్, రోడ్లు నిర్మించాలని) పరిష్కరించాలని పలు కాలనీల ప్రజలు ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, కమిషనర్ భాస్కర్ రెడ్డి, డీఈ రఘు, కౌన్సిలర్లు అనంత్ రెడ్డి, లక్ష్మి వేణు, సరిత రమేశ్, కళావతి, కో-అప్షన్ సభ్యులు అశోక్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీధర్, బీజేపీ అధ్యక్షులు నాగరాజు యాదవ్, నాయకులు గూడూరు అంజన్న, సాయినాథ్ గౌడ్, శ్రీనివాస్, జగన్ మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, అంజయ్య గౌడ్, పెంటయ్య గౌడ్, నర్సింహ గౌడ్, పరమేశ్, భాస్కర్ పాల్గొన్నారు.



రాంపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, పాల్గొన్న చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

గాంధీభవన్ మెట్లపై ధర్నా చేస్తా..

మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు హెచ్చరిక

హైదరాబాద్, జనవరి 16(నమస్తే తెలంగాణ): మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు అధిష్టానానికి హెచ్చరికలు జారీ చేశారు. తనకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని, లేనిపక్షంలో గాంధీ భవన్ మెట్లపై ధర్నా చేస్తానని హెచ్చరించారు. ఈ మేరకు ఆమె గురువారం మీడియాతో మాట్లాడుతూ, సీనియర్ కార్యకర్తగా, ఒక బీసీ మహిళగా, ముదిరాజ్ బిడ్డగా నామినేటెడ్ పదవికి అన్ని రకాలుగా అర్హురాలినని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు తనకు ఎమ్మెల్సీ ఇస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన మాటను నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పీసీసీ చీఫ్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు. త్వరలో భర్తీ చేస్తే నామినేటెడ్ పదవుల్లో సీనియర్ కార్యకర్తలకు, పార్టీ కోసం కష్టపడ్డవారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

చెత్తను పీల్చే.. జటాయువు

జీహెచ్ఎంసీ పరిధిలో ప్రయోగాత్మకంగా ప్రత్యేక పరీక్ష

తెలంగాణలో మొదటిసారిగా ఖైరతాబాద్‌లో డెమో ప్రదర్శన

ఖైరతాబాద్, జనవరి 16: గ్రేటర్‌లో చెత్త సేకరణకు స్వచ్ఛ ఆటోలు, టిప్పర్లు ఉన్నా వందకు వంద శాతం పారిశుద్ధ్యం సాధ్యం కావడం లేదు. దీంతో జీహెచ్ఎంసీ పరిధిలో చెత్తా చెదారాన్ని తొలగించేందుకు ఆ నూతన యంత్రాన్ని ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్‌లోని ఐమాక్స్ సెంటర్, బడా గణేశ్ వెనుక వైపున్న శ్రీనివాస్ నగర్ కాలనీ, న్యూ సీఐబీ క్వార్టర్స్ బస్తీల్లో డెమో ప్రదర్శన ఇచ్చారు. మెక్ క్లీన్ సంస్థ ఈ యంత్రాలను రూపొందిస్తుండగా, వాటి పనితీరును నచ్చితే జీహెచ్ఎంసీ వీటిని ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

బడా గణేశ్ వెనుక వైపు డెమో ఇస్తున్న సిబ్బంది

బీర్ బాటిల్.. కొబ్బరి బోండానైనా...

నగరంలో ఎక్కడా చూసినా ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో పాటు కొబ్బరి బోండాలు దర్శనమిస్తుంటాయి. తాజాగా మద్యం ప్రియులు సైతం రోడ్లపై ఎక్కడపడితే అక్కడ బీరు, వైన్ బాటిళ్లను పడేస్తుంటారు. రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని అరికట్టకపోవడం అటుంచితే, మందు బాబులు ఇష్టం వచ్చినట్లు రోడ్లపై పడేసే బీరు, వైన్ బాటిళ్లను ఈ యంత్రం సాయంతో సునాయాసంగా తొలగించవచ్చని చెబుతున్నారు. అత్యధిక సామర్థ్యం కలిగిన వ్యాక్యుమ్ క్లీనర్ లాంటి ఈ యంత్రానికి 'జటాయువు' అని నామకరణం చేశారు. 1.4 క్యూబిట్ మీటర్ (1.5 టన్నుల) స్టోరేజీ కెపాసిటీ ఉంటుందని, ఎనిమిది ఇంచుల డయా పైపు ఉండటం వల్ల ఏడు ఇంచుల వస్తువును లాగేసుకుంటుంది. ఒక్కో యంత్రం రూ.50 లక్షల వరకు ఉంటుందని, తెలంగాణలోనే మొదటి సారిగా ఖైరతాబాద్‌లో డెమో ఇచ్చామని, జీహెచ్ఎంసీ ప్రతిపాదిస్తే అందించేందుకు సిద్ధంగా ఉన్నామని మెక్ క్లీన్ సంస్థ ప్రతినిధి విజయ్ తెలిపారు.

అమాయక రైతుల భూముల దోపిడీ



రాచులూరులో బాధిత రైతులతో మాట్లాడుతున్న సీపీఎం పార్టీ నాయకులు

- ఫోర్త్ సిటీ పేర దోచుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం
- రైతులకు అండగా ఉంటాం: సీపీఎం నాయకులు

కందుకూరు, జనవరి 16: రాష్ట్ర ప్రభుత్వం ఫోర్త్ సిటీ పేరుతో అమాయక రైతుల భూములు లాక్కొంటుందని సీపీఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య తెలిపారు. రైతులకు తమ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కందుకూరు మండల పరిధిలోని రాచులూరు తదితర గ్రామాల్లో గురువారం పరామర్శించి బాధిత రైతులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పారు. అగర్‌మియగూడ, లేమూరు, రాచులూరు, తిమ్మాపూరు, తుర్కగూడ, ఆకుల మైలారం, గుమ్మడవెల్లి గ్రామాల్లో బేగరి కంచ వద్ద ఏర్పాటు చేస్తున్న ఫోర్త్ సిటీకి 330 ఫీట్ల రోడ్డును తమ పొలాలగుండా ఏర్పాటు చేస్తున్నారని, దీంతో తమకు ఉన్న ఎకరం, రెండు ఎకరాల భూమితో పాటు పౌల్ట్రీ ఫారాలు, కూరగాయాల తోటలు, సేద్యం చేస్తున్న విలువైన భూములు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాము బజారున పడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా తమ భూములు ఎకరాకు రూ.2 కోట్లకు పైగా ధర పలుకుతుందని, ప్రభుత్వం తమకు రూ.70 లక్షల ఇస్తామని, తమకు తెలియకుండా భూములను పోలీస్ బందోబస్తు మధ్య సర్వేను నిర్వహించారని చెప్పారు. తమ భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేమని, ప్రభుత్వం బలవంతంగా లాక్కోవడానికి చూస్తుందని చెప్పారు. అనంతరం, యాదయ్య మాట్లాడుతూ, భూ నిర్వాసితులకు అండగా ఉంటూ పోరాటం చేస్తామని చెప్పారు. సేద్యం చేస్తున్న ఏ రైతు కూడా ఆందోళన చెందవద్దని సూచించారు. రైతుల భూములను లాక్కుంటే ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాంచందర్, సామ్యేల్, నరసింహ, కవిత, చంద్రమోహన్, జగన్, మధుసూదన్ రెడ్డి, మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్, మండల కమిటీ నాయకులు బుడ్డీరపు శ్రీనివాస్, అంకాగాల్ల కుమార్, రాయిచెట్టు చందు, శ్రీశైలం, రాములు, కాళిదాస్, రైతులు పాల్గొన్నారు.

అసఫ్‌జాహి రాజవంశం 9వ నిజాం హిస్ హైనెస్ రౌనక్ యార్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ

ఉర్దూ సంస్కృతికి సాహితీవేత్తల సహకారం మరవలేనిది

అసఫ్ జాహి రాజవంశం 9వ నిజాం హిస్ హైనెస్ రౌనక్ యార్ ఖాన్

సుల్తాన్‌బజార్, జనవరి 16: ఉర్దూను సంస్కృతి, సామరస్య భాషగా ప్రచార చేయడంలో వివిధ రచయితలు, కవుల అపారమైన సహకారాన్ని గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అసఫ్ జాహి రాజవంశం 9వ నిజాం హిస్ హైనెస్ రౌనక్ యార్ ఖాన్ పేర్కొ న్నారు. ఈ మేరకు గురువారం కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం ఉర్దూ విభాగం ఆధ్వర్యంలో అసఫ్ జాహి రాజవంశం 1974 నుంచి 2024 వరకు 300 ఏండ్ల వారసత్వంపై 3 రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన భారతదేశ ప్రజాస్వామ్య ప్రకృతి దృశ్యాన్ని రూపొందించడంలో అసఫ్ జాహి రాజవంశం యొక్క ప్రాముఖ్యతను ప్రతిబింబించారని నొక్కి చెక్కారు. మాజీ కేంద్ర మంత్రి ఎంఎం పల్లం రాజు మాట్లాడుతూ, అస ఫ్ జాహి రాజవంశం వారసత్వం దాని రాజమూలాల గురించి మాత్రమే కాదు, సంస్కృతి, భాష, సాహిత్యంపై ప్రగాఢమైన ప్రభావం కూడా ఉందన్నారు. ఆ వారసత్వాన్ని అన్వేషించడానికి ఈ సదస్సు ఒక అసాధారణ వేదిక అని అన్నారు. ఒక చమత్కారమైన చారిత్రక గమనికగా హిస్ హైనెస్ రౌనక్ యార్ ఖాన్ ముత్తాత హెచ్.హెచ్ మహబూబ్ అలీ పాషా 1980ల చివరలో రాష్ట్ర అధికార భాషను పర్షియన్ నుంచి ఉర్దూకు మార్చడానికి కీలక నిర్ణయం తీసుకున్నారన్నారు. హైదరాబాద్ భాషా ప్రకృతి దృశ్యాన్ని నిర్మించారని పేర్కొన్నారు. సాంస్కృతిక విశ్లేషణలో సాహిత్యం యొక్క కీలక పాత్రను ప్రతిబింబిస్తూ ఊర్దూను ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో ముస్లిమేతర కవులు, రచయితల సహకారం చుట్టూ సదస్సు ముఖ్యమైన ఇతివృత్తాలు తిరుగుతాయన్నారు. ఈ సదస్సు అనంతరం నిర్వహించిన గజల్ కార్యక్రమంతో సదస్సు ముగిసింది. ఈ కార్యక్రమంలో చికాగో నుంచి అథర్ అలీ అసద్, ఢిల్లీ యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ అక్విల్ అహ్మద్, జేఎన్‌యూ ప్రొఫెసర్ ఖ్వాజా మహ్మద్ ఎక్రముద్దీన్, గాంధీ విజనరీ ఫౌండేషన్ ప్రెసిడెంట్ మీర్జా నుస్రతుల్లాబేగ్, సియాసత్ డైలీ సీనియర్ జర్నలిస్ట్ మహ్మద్ రియాజ్ అహ్మద్, కోఠి వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్యధనుంజయ, ఉర్దూ విభాగం నస్రీమ్, అకాడమిక్ అఫైర్స్ డైరెక్టర్ డాక్టర్ లోక పావని తదితరులు పాల్గొన్నారు.